సాక్షి
మెదక్
గురువారం । 22 । జూన్ । 2023



నలుగురిని బలిగొన్న క్షణికావేశం

అక్కన్నపేటకు చెందిన కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటం కలకలం సృష్టించింది. భార్యాభర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవే నలుగురి ప్రాణాలను బలి తీసుకుంది. 4లో



కులవృత్తుల ఆర్థిక సాయం ఇప్పిస్తానని మోసం

4లో

నిరక్షరాస్యుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని మోసం చేశాడు ఓ ప్రబుద్ధుడు. ఈ ఉదంతం పెద్ద చింతకుంటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

నేడు అమరవీరుల సంస్మరణ కార్యక్రమం

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో అమర వీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు జడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అధ్యక్షతన అమరులకు శ్రద్ధాంజలి ఘటించి సంస్మరణ తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు



ప్రిన్సిపాల్ సువర్ణలతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సువర్ణలతకు ఉత్తమ అవార్డు లభించింది. బుధవారం మెదక్‌లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతశేఖర్‌గౌడ్ చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్నారు. అలాగే బెస్ట్ హెచ్‌ఓడీగా పుణ్యవతి, బెస్ట్ లెక్చరర్‌గా ఆర్.మోహన్ కుమార్‌లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈఓ నీలకంఠం, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి జెడ్పీస్థాయీ సంఘాల సమావేశాలు

మెదక్ కలెక్టరేట్: ఈ నెల 27, 28 తేదీల్లో జెడ్పీస్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ వెంకటశైలేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న ఉదయం 11 గంటలకు వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘ సమావేశం, మధ్యాహ్నం 2 గంటలకు స్త్రీ శిశు సంక్షేమంపై 5వ స్థాయీ, మధ్యాహ్నం 3 గంటలకు సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘ సమావేశాలు ఉంటాయని తెలిపారు. 28న ఉదయం పదిన్నర గంటలకు గ్రామీణాభివృద్ధిపై 2వ స్థాయీ సంఘ సమావేశం, మధ్యాహ్నం 12 గంటలకు విద్య, ఆరోగ్యంపై 4వ స్థాయీ, 2.30 గంటలకు ఆర్థిక, ప్రణాళికపై 1వ స్థాయీ, 3.30 గంటలకు పనులపై 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉంటాయని సీఈఓ తెలిపారు.

పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాలకృష్ణ



మెదక్‌జోన్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా మ్యాడం బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బాలకృష్ణ ప్రస్తుతం పీసీసీ ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేసేందుకు కృషి చేస్తానని అన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపిక



ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న ఆనంద్ కుమార్

పెద్ద శంకరంపేట(మెదక్): పెద్ద శంకరంపేట మండలం బద్దారం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్ కుమార్ గణిత విభాగంలో చేపట్టిన ఎగ్జిబిట్ (బోధనభ్యాస సామగ్రి) రాష్ట్రస్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపికైంది. విద్యా దినోత్సవం పురస్కరించుకొని మెదక్ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాలో ఈ ఎగ్జిబిట్ మొదటి బహుమతి సాధించడంతో కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆనంద్‌కుమార్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు

మెదక్ కలెక్టరేట్: హకీంపేట్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల స్పోర్ట్స్ స్కూళ్లలో 4, 5వ తరగతుల్లో ప్రవేశాలు పొందేందుకు మండల, జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై1 నుంచి 5 వరకు ఏదో ఒకరోజు ఎంఈవో ఆధ్వర్యంలో మండల స్థాయి ఎంపికలు జరపనున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన వారికి జూలై14న మెదక్‌లోని ఇందిరా గాంధీ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు హకీంపేట్ క్రీడా పాఠశాలల్లో జరిగే పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 93473 44440, 9493594388 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మస్త్ పైసల్!

లాభాల బాటలో మెదక్ డిపో

- ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానం
- రోజుకు లక్షన్నర అదనపు ఆదాయం
- రెండు నెలల్లో కోటి రూపాయల లాభం



మెదక్ డిపో

మెదక్‌జోన్ : మెదక్ ఆర్టీసీ డిపో లాభాల బాటలో దూసుకుపోతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ముందంజలో ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెదక్, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, దుబ్బాక డిపోలు ఉన్నాయి. వాటిలో ఆదాయం రాబట్టడంలో మెదక్ ప్రథమ స్థానంలో ఉంది.

- మెదక్ డిపోలో మొత్తం 98 బస్సులు ఉన్నాయి. వాటిలో 66 ప్రైవేట్ బస్సులు, 35 ఆర్టీసీ సంస్థకు చెందినవి ఉన్నాయి. వీటిలో 8 ఎక్స్‌ప్రెస్, 10 డీలక్స్, 2 సూపర్ లగ్జరీలు ఉండగా, మిగతావి ఆర్డినరీ బస్సులు ఉన్నాయి.
- ఈ బస్సులు నిత్యం 35,180 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉండగా 36, 800 కిలో మీటర్ల వరకు ప్రయాణం చేస్తున్నాయి. లెక్కల ప్రకారం తిరగాల్సిన దానికన్న 1,620 కిలోమీటర్లు అదనంగా తిరుగుతున్నాయి. దీంతో రోజుకు రూ.15 లక్షల ఆదాయం రావాల్సి ఉండగా రూ.16.50 లక్షల ఆదాయం వస్తుందని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు.
- ఈ లెక్కన మెదక్ డిపోకు నెలకు రూ.4.50 కోట్లు ఆదాయం రావాల్సి ఉండగా, ఏకంగా రూ.4.95 కోట్లు వస్తుంది. అంటే నెలకు రూ.45లక్షలు అదనంగా ఇన్‌కం వస్తుంది. అలాగే ఇందుకు భిన్నంగా గత ఏప్రిల్, మే నెలల్లో ఏకంగా రూ.11.45 కోట్ల ఆదాయం వచ్చిందని, ఇందులో ఆర్టీసీకి అదనంగా కోటి రూపాయల ఆదాయం రావడం ఉమ్మడి జిల్లాలోనే రికార్డుగా నిలిచిందని అధికారులు తెలిపారు.

ఆదాయం సమకూరే రూట్లు ఇవే..

మెదక్ జిల్లాలో మెదక్ డిపోతో పాటు పాతబస్టాండ్, రామాయంపేట బస్టాండ్, కొడిపల్లి బస్టాండ్, చేగుంట, నర్సాపూర్ డిపోలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా మెదక్ -జేబీఎస్, మెదక్-పటాన్‌చెరువు, మెదక్- సిద్దిపేట రూట్లలో అధిక ఆదాయం వస్తుంది. అలాగే పాత బస్సుల స్థానంలో 8 కొత్త బస్సులను వేశారు. అందులో 2 సూపర్ లగ్జరీ, 6 డీలక్స్ బస్సులు ఉన్నాయి. బీదర్‌తో పాటు కర్నూల్, తిరుపతి ప్రాంతాలకు నిత్యం మెదక్ డిపో నుంచి బస్సులను నడుపుతున్నారు.

ఆర్టీసీ అందిస్తున్న సబ్సిడీలు

ఆర్టీసీ పలు రకాల సబ్సిడీలు అందిస్తుంది. ప్రధానంగా డయాలసిస్ పేషెంట్లకు, జర్నలిస్టులకు ఫ్రీబస్ పాస్‌తో పాటు 80 శాతం సబ్సిడీపై విద్యార్థులకు బస్ పాస్‌లను అందిస్తోంది. అలాగే బస్సులో ప్రయాణిస్తుండగా ఏదేని ప్రమాదంలో మరణిస్తే బాధిత కుటుంబానికి పరిహారం కూడా ఇస్తారు.

కార్గోతో ఆదాయం

2020లో ప్రవేశ పెట్టిన కార్గో సర్వీస్ ద్వారా ఆర్టీసీ ఆర్థికంగా పుంజుకుందని చెప్పవచ్చు. ఈ సర్వీస్‌కు ప్రజలు త్వరగా కనెక్టు అయ్యారు. ఏదేని వస్తువును పంపాలన్నా, ఉత్తరాల నుంచి మొదలుకుని వస్తువుల వరకు త్వరగా చేరవేయటంలో కార్గో సక్సెస్ అయ్యింది. ప్రయాణంలో ఆర్టీసీ ఎంత సురక్షితమో వస్తు రవాణాలో కార్గో కూడా అంతే సుక్షితమనే భావనను ప్రజల్లో కలిగించింది.

కొత్త విధానాలతో మార్పు

ఆర్టీసీ సంస్థ అమలు చేస్తున్న కొత్త విధానాలతో ప్రజలకు మరింత చేరువైంది. ఆర్టీసీ బస్ ఆఫీసర్ పేరుతో గ్రామానికో వ్యక్తిని నియమించారు. గ్రామాల్లో ఎవరికైనా పెళ్లి బస్సులు కావాలన్నా, ఆయా గ్రామాల్లో పండగలు, జాతరలు జరిగే సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపటం, ప్రైవేట్ వాహనాలతో పోల్చుకుంటే ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితమైనదిగా ప్రజలకు అవగాహన కలిపించటం వీరి విధి నిర్వహణ. ఇలాంటి నిర్ణయాలతో ఒకప్పుడు నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీ సంస్థ ఉమ్మడి మెదక్ జిల్లాతో పోల్చితే మెదక్ డిపో లాభాల బాటలో నడుస్తోంది.

లాభాల బాటలో..



మెదక్ ఆర్టీసీ డిపో లాభాల బాటలో నడుస్తోంది. నా తోటి ఉద్యోగులతో పాటు కార్మికుల సమష్టి కృషి ఫలితంగానే డిపోను ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఆదాయంలో ముందంజలో ఉంచాం. అందరి సహకారంతో ఇలాగే అధిక లాభాలు గడిస్తాం

–రవిచందర్, డీఎం, మెదక్

ధ్రువీకరణ పత్రాలు త్వరగా అందించాలి

- నేటితో ఇంటింటి సర్వే పూర్తి
- అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్చాలి
- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: మీ సేవ కేంద్రాల ద్వారా ధ్రువపత్రాల కోసం చేసుకున్న దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి జారీ చేయాలని కలెక్టర్ రాజర్షి షా తహసీల్దార్లకు సూచించారు. బుధవారం అదనపు కలెక్టర్ రమేశ్, ఆర్డీఓలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాల జారీ, ఇంటింటి ఓటరు జాబితా సర్వే, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు గుర్తింపు పై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సర్వర్ సమస్య కూడా తీరిందని, ఆదాయ, కుల, రెసిడెన్షియల్ ధ్రువపత్రాలను త్వరగా జారీ చేయాలన్నారు. ప్రధానంగా రుణసాయం కోసం దరఖాస్తు చేసుకునే బీసీ కులాల వారికి త్వరితగతిన అందజేయాలని సూచించారు. ఓటరు జాబితా తయారీలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే గురువారం పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో మృతిచెందిన, షిఫ్టింగ్ అయిన వారి పేర్లను మరోసారి పరిశీలించుకోవాలన్నారు. పొరపాట్లు జరిగినట్లయితే ఫారం 6 ద్వారా తిరిగి ఓటరుగా నమోదు చేయాలన్నారు. అదేవిధంగా అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి యువత ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ సందర్భంగా వస్తున్న ఫామ్ 6,7,8 లను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేస్తూ వచ్చిన పక్షం రోజులలోగా డిస్పోస్ అయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేసి ర్యాంపులు ఉండేలా చూడాలన్నారు. 1500 పైగా ఓటర్లు ఉన్న బూతులతో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భవనాలను గుర్తించాలన్నారు. త్వరలో అన్ని రాజకీయపక్షాలతో సమావేశమై తగు ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్‌కు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు సాయిరాం, శ్రీనివాసులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జయశంకర్ సార్ సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సార్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్ రమేష్, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నష్టాలను, కష్టాలను, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని ప్రజలకు వివరిస్తూ ఉద్యమ స్ఫూర్తిని రగిలించారని అన్నారు. జయశంకర్ సార్ ఆశించినట్లే సుపరిపాలనతో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. బంగారు తెలంగాణ కోసం నిత్యం తపించిన గొప్ప ఆదర్శవాది అని అన్నారు. వారు లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్ జయరాజ్, ఎంపీపీ సిద్ధిరాములు, సుధాకర్ రెడ్డి, పట్లోరి రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, బాల్‌రెడ్డి, రాగి అశోక్, లింగారెడ్డి, వెంకటేశం, గంజి. నవీన్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్ : యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతీ రోజు యోగా చేయడం ద్వారా అనేక రోగాలు దూరమవుతాయని, మనసు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. గ్రామాలలో యోగా కేంద్రాలు అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం యోగా గురువు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ఆసనాలు వేశారు.

యోగాను దినచర్యగా అలవర్చుకోవాలి



ఆసనాలు వేస్తున్న న్యాయమూర్తి, విద్యార్థులు

నర్సాపూర్ రూరల్ : ప్రతీ ఒక్కరు యోగాను దినచర్యగా అలవర్చుకోవాలని నర్సాపూర్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి అనిత సూచించారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ కోర్టు ఆవరణలో విద్యార్థులు, కోర్టు సిబ్బంది, పోలీసులతో కలిసి ఆసనాలు వేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఏ. శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి

నర్సాపూర్ రూరల్: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో పాటు పాలక వర్గాన్ని నియమించాలని దళిత రత్న అవార్డు గ్రహీత, హోలీయదాసరి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శాఖమూరి యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకుడు కాకుండా 59 ఎస్సీ, 33 ఎస్టీ కుల సంఘాల నుంచి సభ్యులను ఎంపిక చేయాలన్నారు. అదేవిధంగా దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మీ సేవ కేంద్రాల వద్ద తగ్గని రద్దీ



నిజాంపేట(మెదక్): తెలంగాణ ప్రభుత్వం అందిస్తానన్న బీసీ రుణాల దరఖాస్తు గడువు పూర్తయినప్పటికీ మీ సేవ కేంద్రాల వద్ద రద్దీ తగ్గ లేదు. మంగళవారం సర్వర్ సమస్యతో సర్టిఫికెట్లు రానివారు బుధవారం నిజాంపేట మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాల వద్ద లబ్ధిదారులు బారులుదీరారు. బీసీ రుణాల దరఖాస్తు రాష్ట్ర ప్రభుత్వం గడువు పెంచుతుందేమోనన్న ఆశతో ధ్రువ పత్రాల కోసం మీసేవ కేంద్రాలకు వస్తున్నారు.

అటు ఇటు అయితే.. అంతే!



అల్లాదుర్గం ఐబీ చౌరస్తాలో ఆటో టాప్‌పై కూర్చున్న ప్రయాణికులు

అల్లాదుర్గం(మెదక్): రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఆటో డ్రైవర్ల తీరు మారడం లేదు. ఆటోలో అధికసంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిబంధనలు పాటించకుండా రోడ్లపై దూసుకుపోతున్నారు. అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద ఓ డ్రైవర్ ఆటోలో ప్రయాణికులను కిక్కిరిసేలా ఎక్కించుకున్నాడు. అంతటితో ఆగకుండా టాప్ పైనా కొందరిని కూర్చోబెట్టుకున్నాడు. కొంచెం అదుపు తప్పినా వారి ప్రాణాలు గాలిలో కలిసే అవకాశం ఉందని తెలిసినా ఆటోను స్పీడ్‌గా నడుపుకుంటూ వెళ్తూ సాక్షి కెమెరాకు చిక్కాడు.

మన ఊరు- మనబడి పనులు పూర్తి చేయాలి

కొండాపూర్ పాఠశాలను సందర్శించిన డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

చేగుంట(తూప్రాన్): మన ఊరు- మనబడి అభివృద్ధి పనులను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. మండలంలోని బీ కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సర్పంచు బాలనర్సు, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రమేశ్, ప్రధానోపాధ్యాయురాలు ఫర్జానా, ఎంపీటీసీ నవీన్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాలకు మహర్దశ

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే

పాపన్నపేట(మెదక్): ఆధ్యాత్మిక కేంద్రాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యమిస్తున్నారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏడుపాయల దుర్గాభవాని అమ్మవారిని కలెక్టర్ రాజర్షిషాతో కలిసి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకులు దేవాలయాల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి ఆలయాన్ని తిరుపతి మాదిరిగా తీర్చిదిద్ది పర్యాటక క్షేత్రంగా మార్చిందని తెలిపారు. ఏడుపాయల ఉత్సవాలకు కేసీఆర్ ప్రతిఏటా కోటి రూపాయల నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. నేడు ఆలయ వార్షిక ఆదాయం కోటి నుంచి ఆరు కోట్లకు చేరుకుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లాలోని 45 మంది పూజారులకు ధూప దీప నైవేద్యం పథకం పత్రాలు అందించారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఈఓ సార శ్రీనివాస్, ఆర్డీఓ సాయిరాం, అర్చకులు పాల్గొన్నారు.

అన్నివర్గాల వారికి ప్రాధాన్యం

మెదక్‌జోన్ : సీఎం కేసీఆర్ అన్నివర్గాల వారికి సమప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఏసుప్రభు దయవల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. చర్చి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆజంపురలోని మసీదులో నమాజ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి మెములా నాయక్, బీసీ అభివృద్ధి అధికారి శంకర్, ఆర్డీవో సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

క్లుప్తంగా

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై హెచ్ఆర్సీలో ఫిర్యాదు

నాంపల్లి: బీఆర్ఎస్‌నేత నీలంమధు ముదిరాజ్, అతడి అనుచరులపై దాడికి పాల్పడిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలిండియా ఓబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు శివ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా నీలం మధు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎమ్మెల్యే అనుచరులు తొలగించారని, అంతటితో ఆగకుండా నీలం మధు, అతని అనుచరులపై దాడి చేశారన్నారు.

బావ ప్రాణాలను రక్షించిన బావమరిది

సిద్దిపేటరూరల్: తన బావకు ప్రమాదవశాత్తు మెడ తెగగా ఈఎంఆర్ఐ చికిత్స అందించి బావమరిది రక్షించుకున్నాడు. ఈ ఉదంతం మండలంలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన దబ్బెట మహేష్.. తన బావ బాలరాజుకు ప్రమాదవశాత్తు మెడ తెగింది. వెంటనే మహేశ్ ఈఎంఐఆర్ ప్రథమ చికిత్స చేసి రక్తం కారడాన్ని నియంత్రించి, హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి సమయానికి తీసుకొచ్చాడు. ప్రథమ చికిత్స చేసి తీసుకొచ్చిన మహేశ్‌ను వైద్యులు అభినందించారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ నెల రోజుల క్రితం పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన క్యాంపులో 22 రకాల ప్రాథమిక చికిత్సలపై శిక్షణ తీసుకున్నానన్నాడు.ఈ క్రమంలోనే తన బావకు ప్రథమ చికిత్స చేయగాలిగానన్నాడు.

తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం



దట్టమైన పొగలు వెలువడుతున్న దృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లి పారిశ్రామిక వాడలోని ఓ స్క్రాబ్ దుకాణంలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. దీంతో దట్టమైన పొగ కమ్ముకొని మంటలు ఎగిసిపడ్డాయి. సమీపంలోని పరిశ్రమల సాయంతో మంటలు ఆర్పివేశారు. దీంతో ఎలాంటి ప్రాణహానీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రసాయన డ్రమ్ములు దుకాణంలో ఉండటంతో రసాయనాల మధ్య రాపిడి జరిగి మంటలు అలుముకున్నాయని స్థానికులు చెబుతున్నారు. నిబంధనలను పాటించకుండా స్క్రాబ్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డంప్‌యార్డ్‌లో మంటలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమలవాడలో గల డంప్ యార్డ్‌లో బుధవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చేసుకుంది. దీంతో మంటలు చెలగేరి, దట్టమైన పొగ కమ్ముకొంది. స్థానికులు నర్సాపూర్ ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి 4 గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేస్తున్నారు.

దౌర్జన్యంగా పనుల అడ్డగింత

శివ్వంపేట(నర్సాపూర్): దౌర్జన్యంగా నిర్మాణ పనులను అడ్డుకొన్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన శివ్వంపేటలో గోలి నాగభుషణం, శేట్టిపల్లి భిక్షపతిలకు సంబంధించిన పట్టాభూమిలో నిర్మాణ పనులు చేస్తుండగా బుధవారం మేస్త్రీలను బెదిరించి, పనులు నిలిపివేయించిన ఖాజామొయినుద్దీన్, శివశంకర్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరితో పాటు మరికొందరు ఉన్నారని వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

నలుగురిని బలిగొన్న క్షణికావేశం

- విషం తాగిన భర్త బతకడని భార్య, ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య
- ఆ మరుసటిరోజే భర్త మృతి



ఇద్దరు పిల్లలతో ఎల్లం, లక్ష్మి (ఫైల్)

రామాయంపేట (మెదక్) : క్షణికావేశం నాలుగు నిండు ప్రాణాలను బలిగొంది. భార్యాభర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవే నలుగురి ప్రాణాలను బలి తీసుకుంది. రామాయంపేట మండలం అక్కన్నపేటకు చెందిన కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటం కలకలం సృష్టించింది. తెలిసిన వివరాల ప్రకారం.. అక్కన్నపేటకు చెందిన కొడుకు ఎల్లంకు, మెదక్ మండలం వెంకటాపూర్‌కు చెందిన లక్ష్మి (నాగలక్ష్మి)కి ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల లోపు ఆడపిల్లలు శరణ్య, శ్రావ్య ఉన్నారు. ఎల్లంకు తల్లిదండ్రులతోపాటు ఇద్దరు సోదరులున్నారు. అందులో ఎల్లమే పెద్దవాడు. ఎల్లంతోపాటు రెండోవాడు అశోక్‌కు పెళ్లి కాగా, మూడో కుమారుడు రాజుకు పెళ్లి కాలేదు. వారికి వ్యవసాయ భూమి లేకపోవడంతో ఎల్లం, తన చిన్న తమ్ముడు రాజుతో కలిసి హైదరాబాద్‌లో పని చేసుకుంటున్నాడు. కాగా వారిది ఉమ్మడి కుటుంబం. ఒకేచోట కలిసి ఉంటున్నారు. ఎల్లం.. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండేవాడు. ఈనెల 12న భార్యాభర్తల మధ్య గొడవ జరుగగా, క్షణికావేశంతో ఎల్లం పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని చికిత్స కోసం మెదక్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఇద్దరు కూతుర్లను తీసుకొని ఆస్పత్రికి వెళ్లిన లక్ష్మికి తన భర్త బతికే అవకాశం లేదని తెలుసుకుంది. దీంతో విలపిస్తూ ఇద్దరు పిల్లలను వెంట తీసుకొని ఆస్పత్రి నుంచి పుట్టింటికి బయలుదేరగా మార్గమధ్యలో కొంటూర్ వద్ద ఆగింది. అక్కడ సమీపాన ఉన్న చెరువులో ఇద్దరు పిల్లలను తోసేసి తానూ నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటికే కోమాలోకి వెళ్లిపోయిన ఆమె భర్త బుధవారం మృతిచెందాడు.

కొడకంచిలో మట్టి అక్రమ తరలింపు



కొడకంచిలో మట్టి తరలింపు ప్రాంతాన్ని చూపుతున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): కొడకంచిలో క్రషర్ నుంచి భారీగా మట్టిని తరలిస్తున్నారని, దీనిని ఆపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ శ్రీశైలం, గ్రామ నాయకులు భాస్కర్, సాయి, దుబ్బ శ్రీనివాస్, భిక్షపతి తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం మట్టిని తరలిస్తున్న ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రషర్ యజమాని నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతోనే ఈ వ్యాపారం నడుస్తోందని ఆరోపించారు. రాత్రి సమయంలో వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారన్నారు. ఈ విషయమై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మట్టి తరలింపుపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



వినయ్‌కుమార్ (ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. రేగోడ్ మండలానికి చెందిన మమత కుమారులతో కలిసి ఉద్యోగరిత్యా జహీరాబాద్‌లో నివాసముంటున్నది. ఈనెల 19న ఝరాసంగంలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి ఆమె కుమారుడు వినయ్‌కుమార్(19) వచ్చాడు. 20న మధ్యాహ్నం స్నేహితుడి ఇంటికెళ్లి వస్తానని ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారినీ, బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ లభించక పోవటంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ఆత్మహత్య

వేర్వేరు చోట్ల పలు కారణాలతో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిజాంపేట, చేర్యాల, మెదక్, సిద్దిపేటలో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి.

అప్పుల బాధతో వ్యక్తి..

నిజాంపేట(మెదక్): అప్పుల బాధతో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేటలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజాంపేటలోని తిరునహరి(అయ్యవారి) శ్రీరాంలు(52) ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఇటీవల తన కుమార్తె అగు నిఖితకు వివాహం చేశాడు. ఆటో ఫైనాన్స్, పలు ప్రైవేటు నెలవారీ వాయిదాలు చెల్లించలేక అప్పుల బాధతో మనస్తాపం సతమతం అవుతున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి నిద్రించాడు. మరుసటిరోజు ఉదయం కుటుంబసభ్యులు గమనించగా శ్రీరాంలు ఇంట్లో ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. మృతుడి కుమారుడు ఉదయ్ కిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు స్థలానికి ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రమీల, కుమార్తె నిఖిత ఉన్నారు.

భార్యతో భర్త గొడవపడి...

చేర్యాల(సిద్దిపేట): భార్యాభర్తల మధ్య గొడవ జరిగి భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు.ఈ ఘటన గడితోటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, సీఐ తెలిపిన వివరాల ప్రకారం గడితోటకు చెందిన యాట రాజు(30) ఈ నెల 18న భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించారని కుటుంబీకులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

యువకుడు...



వెంకట్ (ఫైల్)

మెదక్‌జోన్ : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఓ యువకుడు బలవన్మరణం చెందిన ఘటన హవేళిఘనాపూర్ మండలం బొగుడ భూపతీపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బత్తుల రాములు కుమారుడు వెంకట్(21) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు వెంకట్ ఎప్పుడు మొబైల్ ఎక్కువగా చూసేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఫోన్ లాక్ ఓపెన్ కాలేదని, దీంతో వెంకట్ చనిపోవటానికి గల కారణాలు తెలియ రాలేదని పోలీసులు చెబుతున్నారు. రాములు దంపతులకు వెంకట్ ఒక్కడే కుమారుడు కావటంతో వారి రోదనలు ఆపటం ఎవరి తరమూ కాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో చెరువులో..

మెదక్‌జోన్: కుటుంబ కలహాలతో చెరువులో పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హవేళిఘణాపూర్ మండలం వాడిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పాపన్నపేట మండలం రాంతీర్థం గ్రామానికి చెందిన రమేశ్(26) హవేళిఘణాపూర్ మండల పరిధిలోని వాడి గ్రామానికి చెందిన దుర్గయ్య కుమార్తె రేణుకను పెళ్లి చేసుకొని ఇల్లరికానికి వచ్చాడు. కొన్నేళ్లుగా దంపతులు బాగానే ఉన్నారు. కాగా మంగళవారం భార్యతో రమేశ్ గొడవ పడ్డాడు. ఈ ఘటనతో మనస్తాపానికి గురై స్థానికంగా ఉన్న చెరువులో రమేశ్ దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు మృతదేహాన్ని బయటికి తెచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న హవేళిఘణాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బావిలో దూకి...



చాంద్ మృతదేహం

సిద్దిపేటఅర్బన్: యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని పొన్నాల శివారులో జరిగింది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా తామ్సి గ్రామానికి చెందిన చాంద్ (26) దాబాలలో పనిచేస్తుంటాడు. 15 రోజుల క్రితం పొన్నాలలోని ఓ దాబాలో పనికి కుదిరాడు. ఉన్నట్టుండి బుధవారం సాయంత్రం దాబాల సమీపంలోని ఓ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని అతడి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

కేబుల్ వైర్‌ల చోరీకి విఫలయత్నం

గజ్వేల్‌రూరల్: బోరుబావుల వద్ద మోటార్ కేబుల్ వైర్ల చోరీకి విఫలయత్నం చేసిన ఇద్దరిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రిమ్మనగూడలో బోరుబావుల వద్ద విద్యుత్ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్‌లను చోరీకి ప్రయత్నిస్తున్న ఇద్దరిని పట్టుకొని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ వైర్ చోరీ

మిరుదొడ్డి(దుబ్బాక): బోరు మోటారుకు చెందిన కేబుల్ వైర్ మండల పరిధిలోని అల్వాలలో బుధవారం చోరీకి గురైంది. మిరుదొడ్డి ఎస్ఐ శ్రీధర్‌గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన బొమ్మ చిన్న లింగం వ్యవసాయ పొలంలో సుమారు రూ. 5 వేల విలువ కలిగిన బోరు మోటారు కేబుల్ వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

తమ్ముడి హత్యాయత్నం

జహీరాబాద్ టౌన్: ఆస్తి కోసం అన్నపై హత్యాయత్నం చేసిన తమ్ముడు కటకటాలపాలయ్యాడు. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ.శ్రీకాంత్ కథనం ప్రకారం పట్టణంలోని అల్లీపూర్ బాలాజీనగర్‌కు చెందిన మెట్టు పెంటయ్యకు నర్సింలు, నరేష్, సురేష్ ముగ్గురు కొడుకులున్నారు. నరేష్, సురేష్ తాగుడుకు బానిసై నిత్యం గొడవపడుతుండగా, అన్న నర్సింలు పెళ్లిచేసుకుని మహీంద్ర కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. సురేష్ ఇంటిని అమ్మి పెళ్లి చేయాలని తల్లిని వేధిస్తుండగా.. అన్న నరేష్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. తనకు అన్న నరేష్ అడ్డు తగులుతున్నాడని భావించి హత్య చేయాలని సురేష్ ప్లాన్ వేశాడు. కాగా, మే 28న రాత్రి నరేష్ మద్యంతాగి ఇంటికొచ్చి నిద్రిస్తున్నాడు. అదే అదనుగా భావించిన సురేష్ కత్తితో నరేష్ గొంతు కోసి పరారయ్యాడు. వెంటనే నరేష్‌ను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సోదరుడు నర్సింలు ఫిర్యాదు మేరకు నరేష్‌పై హత్యాయత్నం చేసిన సురేష్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

కులవృత్తుల ఆర్థిక సాయం ఇప్పిస్తానని టోకరా

నర్సాపూర్: నిరక్షరాస్యుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని మోసం చేశాడు ఓ ప్రబుద్ధుడు.ఈ ఉదంతం పెద్దచింతకుంటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పెద్దచింతకుంటకు చెందిన వుల మల్లయ్య, ఆవుల ఎల్లయ్య, ఆవుల సాయిలు, శ్రీనివాస్‌లతో పాటు రెడ్డిపల్లికి చెందిన సాయిలు మంగళవారం నర్సాపూర్‌లో కులవృత్తుల ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసేందుకు వచ్చారు. ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న వివేకానంద కాలనీలోని ఓ జిరాక్స్ దుకాణం వద్ద దరఖాస్తు ఫారాలు తీసుకుంటుండగా ఆగంతకుడు వచ్చాడు. తాను ఫారాలు నింపి ఇస్తానని, పైసలు మంజూరయ్యేలా చేస్తానని, అందుకు ఒక్కొక్కరూ రూ.వెయ్యి ఇవ్వాలని అడగ్గా అంగీకరించారు. అతడి మాటలు నమ్మి అందరూ కలిసి ఐదు వేలను ముట్టజెప్పారు. ఫారాలు నింపిన తర్వాత ఫొటోలు తీయాలని చెప్పి శ్రీనివాస్ నుంచి స్మార్ట్ ఫోన్‌ను కూడా తీసుకొని అక్కడి నుంచి ఉడాయించాడు.ఎంత సేపటికీ రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు బుధవారం విలేకరులతో జరిగిన మోసాన్ని చెప్పారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



రోహన్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ : తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు పోలీసులు. సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పట్టణంలోని వీర హనుమాన్ కాలనీలో జావేద్ అనే మూడున్నరేళ్ల బాలుడు తప్పిపోయి ఏడుస్తున్నాడని 100కు డయల్ కాల్ వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న టౌన్ బ్లూకోర్టు టీమ్ దుర్గపతి, మోహన్.. ఆ బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారణలో తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన తుమ్మ వీరబాబు కుమారుడు రోహన్ కుమార్‌గా గుర్తించారు. అనంతరం స్టేషన్‌కు తల్లిదండ్రులను రప్పించి బాలుడిని అప్పగించారు.

గాయపడ్డ వీఆర్ఏ మృతి

టేక్మాల్(మెదక్): మండలంలోని ఎల్లుపేట శివారులో జరిగినా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీఆర్ఏ గురువారం మృతిచెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపినా వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం కొంపల్లి గ్రామానికి చెందిన చాకలి సాయిలు (32) వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 16న మండలంలోని ఎల్లుపేట గ్రామానికి బైక్‌పై వచ్చి తిరిగెళ్తుండగా ఎల్లుపేట శివారులో అడవి పంది రోడ్డుగా అడ్డగా రాగా వాహనం తప్పించబోయి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈనెల 17న హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. మృతుడి తల్లి చాకలి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ..



సత్తెమ్మ మృతదేహం

నర్సాపూర్ రూరల్: అనుమానాస్పద స్థితిలో మహిళా మృతిచెందిన సంఘటన నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లిలో చోటుచేసుకుంది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన చాకంటి సత్తెమ్మ (50) ఈనెల 20న మంగళవారం పెన్షన్ డబ్బుల కోసం నారాయణపూర్‌కు వెళ్ళింది. సాయంత్రానికి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కుమారుడు చాకంటి నవీన్ వెళ్లగా, సత్తెమ్మ కల్లు దుకాణంలో కనిపించింది. నవీన్ ఆమెను ఆటో వరకు గుంజుకు రావడంతో స్పృహ తప్పి పడిపోయింది. సత్తెమ్మ ను వెంటనే అతడే నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. సత్తెమ్మ నాలుగు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. సత్తెమ్మ చెల్లెలు లింగమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి కింద కేసు నమోదైంది. ఎస్సై శివకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...



చంద్రశేఖర్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నర్సాపూర్ లో బుధవారం జరిగింది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చాకలి గౌరీగారి చంద్రశేఖర్ (35) గత శనివారం ఉదయం బైక్ పై ఖానాపూర్‌లో గల ఎన్‌సీఎల్ కంపెనీలో విధులు నిర్వర్తించేందుకు బయలుదేరారు. నర్సాపూర్ - సంగారెడ్డి రహదారిలోని మూతపడిన పౌల్ట్రీ ఫామ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం చంద్రశేఖర్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ కు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న కొంతమంది చంద్రశేఖర్ ను నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు. అక్కడే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

ఖాజాపూర్‌లో పట్టపగలే చోరీ



ఖాజాపూర్‌లో అనుమానితులను ప్రశ్నిస్తున్న ఎస్ఐ సుభాష్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): పట్టపగలే ఇంట్లో దొంగలు రూ. 2లక్షల నగదు దోచుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి గొల్ల శంకరయ్య పెద్దకుమారుడు మల్లేశంకు సొంత ఆటో ఉంది. కిరాయికి వెళుతూ ఉంటాడు. బుధవారం ఆయన ఆటో తీసుకొని బయటకు వెళ్లగా, ఆయన భార్య పక్కింట్లోకి వెళ్లింది. మల్లేశం ఇంటి వద్దకు ఆటో కోసమంటూ కొందరు వచ్చి అక్కడ తచ్చాడుతున్నారు. శంకరయ్య ఎందుకు వచ్చారని అడగగా ఆటో కోసం వచ్చినట్టు తెలిపారు. తర్వాత ఆయన తన చిన్నకుమారుడు ప్రసాద్ ఇంటికి వెళ్లాడు. అప్పటికే మల్లేశం భార్య కూడా ప్రసాద్ ఇంటికే వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంట్లో చొరబడి బీరువాను పగలకొట్టి అందులోని నగదును అపహరించుకుపోయారు. మల్లేశం భార్య తిరిగొచ్చేసరికి బీరువా పగలకొట్టి ఉండటాన్ని గుర్తించి, లోపలికి వెళ్లగా ఇంటి లోన్ చెల్లించేందుకు తెచ్చిన రూ. 2 లక్షలు బీరువాలో కనిపించలేదు. స్థానికులు ఆరుగురిని పట్టుకోగా, మరొకరు అప్పటికే గ్రామం దాటినట్లు చెబుతున్నారు.ఈ చోరీపై పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

చినుకు చింత

- 20 రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు
- తొలకరి వర్షాలకు నాటగా మొలకెత్తి ఎండిన విత్తనాలు
- 80 శాతం మేర పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ సాగు
- మొలకలు దెబ్బతినడంతో ఆందోళనలో రైతాంగం

జహీరాబాద్: మృగశిర కార్తె ప్రవేశానికి ముందే వచ్చిన తొలకరి వర్షాలు రైతులను మురిపించి మాయమయ్యాయి. ఊరించిన వర్షాలకు సంతోషపడిన రైతాంగం విత్తనాలను ముమ్మరంగా నాటారు. వర్షాలు రాకుండా పోతాయా అన్న నమ్మకంతో విత్తనాలు నాటారు. విత్తనాలు వేసి పక్షం రోజులు కావడంతో మొలకెత్తి ఎండిపోయాయి. భూమిలో తేమకు అక్కడక్కడ మొలకెత్తిన మొక్కలు కూడా ఎండిపోయాయి. పంటలు వేసుకునేందుకు భారీగా పెట్టిన పెట్టుబడులు తిరిగిరాకుండా పోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాలో రైతులు ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ విత్తనాలను సుమారు 80 శాతం మేర వేసుకున్నారు. అత్యధికంగా పత్తి సాగు చేపట్టారు.
- జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో పత్తి సాగుకు వైపు ఆసక్తి చూపారు. ముందస్తుగా కురిసిన వర్షాలకు భూమిలో తేమ ఉండడం, అందుకు తోడు తొలకరి వర్షాలు పండటంతో రైతులు ముమ్మరంగా పత్తి విత్తనాలు నాటుకున్నారు. మరికొందరు మొక్కజొన్న, సోయాబీన్ పంటలు వేసుకున్నారు.
- గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు ఎక్కువ రోజులు గ్యాప్ రావడంతో వేసిన విత్తనాలు దెబ్బతిన్నాయని రైతులు అంటున్నారు.

పంటను కాపాడుకునేందుకు పాట్లు

- వ్యవసాయ బావులు, బోర్ల కింద నీటి సదుపాయం ఉన్న రైతులు మాత్రం పంటలను కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు. స్ప్రింక్లర్ల ద్వారా నీటి తడులు అందిస్తున్నారు.
- ఇది కూడ కొద్దిపాటి విస్తీర్ణంలో ఉన్న పంటలకే నీటిని అందించడం సాధ్యపడుతోందని రైతులు చెబుతున్నారు. నీరు పెట్టినా తీవ్ర ఎండలకు తేమ అప్పుడే ఆరిపోతోందన్నారు.



సోయాబీన్ పంటకు స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

7.19 లక్షల ఎకరాల్లో పంటల సాగు అంచనా

- వర్షాకాలంలో జిల్లాలో 7.19 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో పత్తి 3,50,936 ఎకరాల్లో సాగు కానుందని అంచనా.
- వరి 1,38,380 ఎకరాల్లో, కంది 83,791 ఎకరాల్లో, సోయాబీన్, 81,978 ఎకరాల్లో, మొక్కజొన్న 16,502 ఎకరాల్లో, పెసర 13,562 ఎకరాల్లో, మినుము 6,275 ఎకరాల్లో, జొన్న 841 ఎకరాల్లో సాగు అయ్యే అవకాశం ఉంది.
- పత్తి, కంది పంటలు అమీన్‌పూర్, జిన్నారం మండలాల్లో, వరి జహీరాబాద్ నియోజకవర్గంలో తప్ప మిగతా అన్ని నియోజకవర్గాల్లో సాగుకానుంది. సోయాబీన్ జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ ప్రాంతాల్లో మాత్రమే సాగు అవుతుంది. మొక్కజొన్న జహీరాబాద్ నియోజకవర్గంలోనే అత్యధికంగా సాగు కానుంది.

రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా



తొలకరి వర్షాలు పడటంతో విత్తనాలు వేశాను. పత్తి పంట 35 ఎకరాల్లో, మొక్కజొన్న 20 ఎకరాల్లో, సోయాబీన్ ఏడు ఎకరాల్లో వేసుకున్నాను. భూమిలో ఉన్న తేమకు మొలకలు వచ్చాయి. ఎండల తీవ్రతతో వచ్చిన మొలకలు ఎండి పోయాయి. పంటల సాగు కోసం రూ.2 లక్షల మేర పెట్టుబడులు పెట్టాను. గత ఏడాది అధిక వర్షాలతో పత్తి, సోయాబీన్ పంటలు దెబ్బతిని సుమారు రూ.4 లక్షల మేర నష్టపోయాను.

– కొత్త అంజిరెడ్డి, రైతు, కోహీర్


సోయాబీన్ దెబ్బతిన్నది



రెండు ఎకరాల్లో సోయాబీన్ పంట వేశాను. ఇప్పుడు వర్షాలు కురియడం లేదు. దీంతో పంట మొలకెత్తి ఎండిపోయింది. తిరిగి విత్తనాలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తరపున ఉచితంగా విత్తనాలు అందజేసి రైతులను ఆదుకోవాలి.

– రాజ్‌కుమార్, రైతు-రంజోల్

వర్షాలు కురిసిన తర్వాతే విత్తుకోవాలి



తగినంత వర్షం కురిసిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలి. రైతులు పాత సాంప్రదాయం ప్రకారం విత్తనాలు వేస్తున్నారు. పొడి మట్టిలో విత్తుకుంటే తగినంత మొలకలు రావు. రెండు వర్షాలు కురిసిన తర్వాత రైతులు విత్తనాలు వేసుకోవాలి. అప్పుడే వంద శాతం మొలకలు మొలుస్తాయి. విత్తనాలు వేసుకునేందుకు ఈ నెలాఖరు వరకు సమయం ఉంది.

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి సంగారెడ్డి